


# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**JULY - 2011**

సంవత్సర చందా రూ. 50/-

## మీ కొక గొప్ప సదవకాశం

**సత్యవాణి** ద్వారా ప్రచురించబడిన అత్యంత విలువైన పుస్తకములు 15 రకములు ఇప్పడు లభ్యమగుచున్నవి. వాటి నికర మూల్యము 500 రూ॥లు అగును. గాని మీరు 85 /-రూ॥లు మాత్రమే మాకు M.O పంపి వాటిని ఉచితముగా పొందవచ్చును. బైబిల్ విద్యార్థులకు, బోధకులకు, తర్భీతుశాలలకు యిది గొప్ప సదవకాశం. ఈ రోజే మాకు వ్రాయండి. M.O పంపించి పుస్తకములను పొందండి. మీ యింటిలో మినీ లైబ్రరీని స్థాపించండి.

మా అడ్రస్:

Satya Vani

# 7-9-35, Sambamurty Street,
Kakinada - 533 004. Ph: 0884 - 2363722

# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 31 | జూలై - 2011 | సంచిక -12


## దైవారాధన
## (Worship of God)

ఆదినుండియు మానవులు దేవుని నారాధించు స్వభావము కలవారని మనం తెలిసికొని యున్నాము. మనము దేవుని నెరిగి, ఆయనను మహిమ పరచవలెనని ఆయనకు కృతజ్ఞతా స్తుతులు చెల్లింప వలెనని దేవుడు కోరుచున్నారు. దేవుని యెడల మనకున్న భక్తి విశ్వాసము లన్నియును మనము ఆయనకు చేయు ఆరాధనలో తేటతెల్ల మగును. దేవుని మనము ఆరాధించునపుడు నిష్కపటము గను, యథార్థము గను ఆరాధించవలెను.

యేసుప్రభువు ఇట్లనుచున్నారు: "అయితే యథార్థముగా ఆరాధించు వారు, ఆత్మతోను, సత్యముతోను తండ్రిని ఆరాధించుకాలము వచ్చుచున్నది; అది ఇప్పుడును వచ్చేయున్నది; తన్ను ఆరాధిం చువారు అట్టివారే కావలెనని తండ్రి కోరుకొనుచున్నాడు; దేవుడు ఆత్మగనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను. సత్యముతోను, ఆరాధింప వలెను" (యోహాను 4:23-24).

మానవులు దేవుని వెదుకుట

యేగాక, ఆయనకు ఇష్టులైయుండుటకు ఆయనను వెదకవలయును. "విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము; దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్నువెదకు వారికి ఫలము దయ చేయువాడనియు నమ్మవలెను" (హెబ్రీ 11:6). "అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తీయబడును. అడుగు ప్రతివాడును పొందును, వెదకు వానికి దొరుకును, తట్టువానికి తీయబడును" అని యేసుక్రీస్తు చెప్పెను (మత్తయి 7:28).

దేవుని వెదకువారు దేవుని చిత్తము చొప్పుననే వెదుకలెను కదా? అట్లే మనము చేయు ఆరాధన దేవునికి ఇష్టపూర్వకముగా యుండవలెననిన, దేవుడు చెప్పినట్లే దానిని మనము చేయవలెను. లేనియెడల మన స్వంత అభిలాషల చొప్పున సేవించి, ఆరాధింప ప్రయత్నించిన యెడల అట్టివి వ్యర్థమగును. భక్తుడైన యాకోబు ఇట్లు చెప్పుచున్నాడు: "ఎవడైనను నోటికి కళ్లెము పెట్టుకొనక తన హృదయమును మోసపరచుకొనుచు భక్తిగలవాడని అనుకొనిన యెడల వాని భక్తి వ్యర్థమే" (యాకోబు 1:26). మరల యేసుప్రభువు ఇట్లనుచున్నారు: " ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరుచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా ఉన్నది; మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" (మత్తయి 15:9). మనము చూచిన ఈ రెండు వచనములను బట్టి వ్యర్థమైన భక్తి, వ్యర్థమైన ఆరాధన చేయుట సాధ్యమే యని దేవుడు మనకు విశదీకరించుచున్నారు. వ్యర్థము అనగా ప్రయోజనము లేనిది, పనికిరానిది అని అర్థము గనుక దేవునికి మనము చేయు సేవ ప్రయోజనకరముగా నుండునట్లు మనము జాగ్రత్తపడవలయును. ఆయనకు ప్రీతికరమైన సేవను చేయు నిమిత్తము మనము "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్య వాక్యమును సరిగా ఉపదేశించు వానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచు కొనుటకు జాగ్రతపడుము" అని పరిశుద్ధాత్ముడు పౌలు ద్వారా ఈనాడు మనలను హెచ్చరించుచున్నాడు (2 తిమోతి 2:15).

దేవుని ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను అని యేసుప్రభువు చెప్పెను. గనుక ఆయనను ఆరాధింపవలెననిన సత్యముతో ఆరాధింపవలెను అని యేసుప్రభువు చెప్పెను. గనుక ఆయనను ఆరాధింప వలెననిన సత్యమును ముందు మనము తెలిసికొనవలెను. సత్యమనగా నేమి? అని మీరడుగ వచ్చును. దేవుని వాక్యమే సత్యము అని యేసుప్రభువు దేవుని గూర్చి పలికెను. మరల ఆయన, "నేనే మార్గమును,

సత్యమును, జీవమునై యున్నాను" అని చెప్పుచున్నారు. గనుక మనము దేవుని ఆరాధించునపుడు దేవుని యొక్కయు దేవుని కుమారుడైన క్రీస్తు యొక్కయు వాక్యము ననుసరించి ఆరాధింపవలెను.

సత్యము ఎల్లప్పుడు పరిపూర్ణ మైనది. పరిపూర్ణసత్యము దోషము లేనిది. అందువలన అది ఎల్లప్పుడు ఏకీభావ మునే వ్యక్తపరచును గాని, స్వయం విరుద్ధ సంగతులనది భోధింపదు. సత్యవాక్యమ యిన బైబిలును మనము చదువునప్పుడు, అందులో మనకుకన్పడు ఆరాధనే క్రమము, ఆరాధన అంతయు ఏకీభావ మునే వ్యక్తపరచును గాని వేర్వేరు వ్యక్తుల కు వేర్వేరు సంగతులనది బోధిం పదు. దేవుని వాక్య ప్రకారము లేనిదల్లా అసత్యమని మనము గ్రహించ వలయు ను. మనము అసత్యమును ద్వేషించి, సత్య మును ప్రేమించవలయును. అపొస్తలు డైన పౌలు ఇట్లు వ్రాయుచున్నాడు: "దుర్నీతియందు అభిలాష కలవారు అందరును శిక్షావిధి పొందుటకై అబ ద్ధమును నమ్మునట్లు మోసము చేయు శక్తిని దేవుడు వారికి పంపుచున్నాడు" (2థెస్స 2:10-12). దుర్నీతి నుండియు, పాపము నుండియు మనము విడుదల పొందలెననిన మనము సత్యమును తెలిసికొని, దానిని పాటించ వలయును. యేసు ఇట్లు చెప్పుచున్నారు: "మీరు నా వాక్యమందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులై యుండి సత్యమును గ్రహించె దరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగాచేయును" (యోహాను 8:31-32). మనము దేవునికి చేయు సేవ లేదా ఆరాధన సత్యవాక్యము ననుసరించి యుండవలెను. నిష్కపట హృదయము మనకు ఉన్నంత మాత్రమున అది సరి పోదు. మనకు తోచినదల్లా దైవారాధన లోనికి మనము తీసికొని రాకూడదు.

మనము చేయు సత్యారాధన యెట్లుండవలెను? అని మనము అడగ వచ్చును.

మొదటిగా మన ఆరాధన మూర్తి నిజదేవుడై యుండవలెను. మానవులను గాని, మానవకల్పిత విగ్రహములనుగాని మనము ఆరాధించ కూడదు. "లోక మందు విగ్రహము వట్టిదనియు, ఒక్కడే దేవుడు తప్ప వేరొక దేవుడు లేడనియు ఎరుగుదుము. దేవతలనబడినవారును, ప్రభువులనబడిన వారును అనేకులు న్నారు. ఆకాశమందైనను, భూమి మీదనై నను దేవతలనబడినవి యున్నను, మనకు ఒక్కడే దేవుడున్నాడు. ఆయన తండ్రి; అయన నుండి సమస్తమును కలిగెను. ఆయన నిమిత్తము మనమున్నాము, మరియు మనకు ప్రభువుఒక్కడే; ఆయన యేసుక్రీస్తు ఆయన ద్వారా సమస్తము కలిగెను మనము ఆయన ద్వారా కలిగిన

వారము" (1 కొరింథి 8:4-6). దేవుడు ఆత్మయై యున్నారు. ఆయన నిర్జీవమైన ఒక విగ్రహము కాదు. అందువలన ఈ ఆత్మయైన దేవుని మనము మన ఆత్మ ద్వారా ఆయన వాక్యజ్ఞానము కలిగి ఆరాధింపవలెను.

మనము ఆరాధించునపుడు మనకును, దేవునికిని సరియైన మధ్యవర్తి యుండవలెను. ఈ మధ్యవర్తి భూసంబంధ యాజకుడు కాదు, గాని ఆయన మన ప్రధాన యాజకుడగు యేసుక్రీస్తు. "దేవుడొక్కడే, దేవునికిని నరులకును మధ్య వర్తి ఒక్కడే; ఆయన క్రీస్తుయేసను నరుడు" అని బైబిలు భోధించుచున్నది (1 తిమోతి 2:5). "ఆకాశమండలము గుండా వెళ్లిన దేవుని కుమారుడైన యేసు అను గొప్ప ప్రధాన యాజకుడు మనకు ఉన్నాడు. గనుక మనము ఒప్పుకొనిన దానిని గట్టిగా చేపట్టుదము. మన ప్రధాన యాజకుడు మన బలహీనతలయందు మనతో సహాను భవము లేనివాడు కాడుగాని, సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను ఆయన పాపము లేని వాడుగా ఉండెను గనుక మనము కనికరింపబడి, సమయోచితమైన సహాయము కొరకు కృపపొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము" (హెబ్రీ 4:14-16).

మన ఆరాధన యధార్ధముగనుండుటకు దేవునితో మనము సరియైన సంబంధమును కలిగి యుండవలెను. "ప్రభువు కన్నులు నీతి మంతుల మీదను, ఆయన చెవులు వారి ప్రార్ధనల వైపునను ఉన్నవిగాని, ప్రభువు ముఖము కీడుచేయు వారికి విరోధముగా ఉన్నది" (1 పేతురు 3:12). "మరియు మనమాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన దృష్టికి ఇష్టమైనవి చేయుచున్నాము గనుక మనమేమి అడిగినను అది ఆయన వలన మనకు దొరకును" అని దేవునివాక్యము చెప్పుచున్నది (1యోహాను 3:22).

ఆరాధన చేయునప్పుడు మనము సరియైన మనస్తత్వము కలిగి ఆరాధించవలెను. అందువలన పౌలు ఇట్లనుచున్నాడు: "కాబట్టి ఆత్మతో ప్రార్ధన చేతును, మనస్సుతోను ప్రార్ధన చేతును; ఆత్మతో పాడుదును మనస్సుతోను పాడుదును" (1 కొరింధీ 14:15). "మరియు మాటచేత గాని, క్రియచేతగాని మీరేమి చేసినను, ప్రభువైన యేసుద్వారా తండ్రియైన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు, సమస్తమును ఆయన పేరట చేయుడి" (కొలస్స 3:17).

ఆరాధన చేయునప్పుడు, అందలి క్రియలు సరియైనవి, అనగా దేవుడు కోరినట్టివి అయి యుండవలెను. ఆరాధనలో దేవుని మనము కీర్తనలతోను, ఆత్మ

సంబంధమైన పద్యములతోను స్తుతించ వలెను గాని యాంత్రిక వాయిద్యములతో కాదు (కొలస్స 3:16). ప్రార్థన చేయుమని ఆయన కోరుచున్నారు. వాక్యమును బోధించుట, ప్రభురాత్రి భోజనము ప్రతి ఆదివారమున జరిగించుట, కానుకల నిచ్చుట గూడ ప్రతి ఆదివారమున జరుగ వలెనని ఆయన గ్రంథము ద్వారా మన లను హెచ్చరించుచున్నారు. ఇట్టిక్రియ లను సత్యముతోను, ఆత్మతోను చేసిన యెడల మనము దేవుని కర్పించు ఆరాధన యథార్థమైనదై ఆయనకు ప్రీతికరముగా నుండును (అపొ.కా. 2:42; 1 కొరింథీ 16:1-2).

మన ఆరాధన అంతయును ఆయన సంఘము ద్వారా చేయవలెను: "క్రీస్తు యేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగును గాక" (ఎఫెసీ 3:21). నీవు ఆయనను ప్రీతికరముగా ఆరాధించవలెన నిన రక్షణపొందుట అత్యవసరము, రక్షింప బడిన వారినందరినీ ప్రభువు తన సంఘముతో చేర్చుకొనును. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును గనుక నీవు యేసునందు విశ్వాసముంచి, నీపాపముల విషయమై మార్పునొంది క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందుటకు తడవు చేయవద్దు. ఆయన ఇచ్చు ఉచిత రక్షణను ఈనాడే తప్పక నీవు అంగీకరించుదువు అని నా విశ్వాసము (అపొ.కా. 2:38); మార్కు 16:16; అపొ.కా. 22:16).

క్రైస్తవరుజువులు :

## ప్రవచనముల నుండి ఋజువు
## (Evidence From Prophecy)

బైబిలు దేవుని వాక్యమనడానికి గల గొప్ప నిదర్శనము అందలి ప్రవచ నముల నేరవేర్పే. దేవుడు మాత్రమే భవిష్యత్తును ఎరిగినవాడు. పేరుగాంచిన ఆత్మ తత్వజ్ఞులు కూడ భవిష్యత్తును ఖచ్చితముగా చెప్పలేరు. అయితే బైబిలు నందలి ప్రవక్తలు కొన్ని దశాబ్దాలు లేక శతాబ్దాలకు ముందే ఆయా సంఘట నలను గూర్చి చెప్పగలిగే వారు. వారి ప్రవచనములు గనుక ఖచ్చితంగా నెరవేరినట్లయితే వారు దేవుని ఆత్మ ప్రేరణ గలవారని చెప్పుట అతిశయోక్తికాదు.

అయితే ప్రశ్న యేమంటే, బైబిలు ప్రవచనములు ఏమైనా అక్షరార్థముగా, అవి చెప్పబడిన అనేక సంవత్సరముల తరువాత నెరవేరినవా?

**ప్రవచనముల తేదీలు నిర్ణయించుట :**

అక్షరార్థముగా, ప్రత్యేకముగా ఖచ్చితంగా నెరవేరిన ప్రవచనములు బైబిలు నందు వందల కొలదీ వున్నాయి. అవి నెరవేరక వందలాది సంవత్సరముల ముందే చెప్పబడియున్నాయి.

"చరిత్రలో క్రీస్తును గూర్చిన రుజువు" అను అంశములో మెస్సీయను గూర్చి చెప్పబడిన 66 ప్రవచనములను మనం గమనించాము. వాటన్నిటినీ యేసుక్రీస్తు సంపూర్ణముగా నెరవేర్చారు. యేసుక్రీస్తు పుట్టక కొన్ని వందల సంవత్సరములకు ముందే ఈ ప్రవచనములు చెప్పబడెనని మనం ఎరుగుదుము. అవి గ్రీకు భాష లోనికి తర్జుమా చేయబడిన సెప్టూజింట్ బైబిలునందు కలవు. అది క్రీ॥పూ॥ 250 లో తర్జుమా చేయబడెను. సెప్టూజంట్ బైబిలులోని భాగములు క్రీ॥పూ 200 సం॥లో తయారు చేయ బడెను. మృత సముద్ర ప్రాంతములో దొరికిన గ్రంథపు చుట్టలు అందలి భాగములు క్రీ॥పూ॥ 100–150 ల మధ్య తయారు చేయబడెను. అవన్నీ క్రీస్తు చనిపోయిన తరువాత వ్రాయబడెనని చెబితే, అది అసంభవము.

ఈ పాఠంలో ఆయా పట్టణములను గూర్చియు, జనాంగములను గూర్చియు అవి వ్రాయబడిన అనేక సంవత్సరములు తరువాత నెరవేరిన వాటిని కొన్ని గమనించుదాము. దైవాత్మా వేశ ప్రేరణ లేని మనుష్యులు లోక జ్ఞానము ననుసరించి అట్టి ప్రవచనములు చేయుట అసంభవము. ఎవరు ఊహిం చలేని సంఘటనలను గూర్చి ప్రవక్తలు ముందుగనే ప్రవచించిరి. ఇప్పుడు కొన్ని ఉదాహరణలు గమనించి, అవన్నీ అదృష్టావత్తు నెరవేరినవని మనం చెప్పగలమా? పరీక్షింతము.

**తూరుపట్టణము:**

క్రీస్తు పూర్వము 588 లో ప్రవక్తయైన యెహెజ్కేలు ఇట్లు పలికాడు: "ప్రభువైన యెహోవా సెలవిచ్చున దేమనగా తూరు పట్టణమా, నేను నీకు విరోధినైతిని, సముద్రము దాని తరంగములను పొంగ జేయునట్లుగా నేను అనేక జనములను కూర్చి దాని కోటలను పడగొట్టుదును, నేను దానిమీద నున్న మంటిని తుడిచి వేయుదును" (యెహెజ్కేలు 26:3–4).

క్రీ॥పూ 583లో అనగా ఈ ప్రవచనము చెప్పబడిన మూడు సంవత్సరములలో నెబుకద్నెజరు తూరు పట్టణము ను ముట్టడించెను; 13 సంవత్సరముల తరువాత అతడు దాని గుమ్మములను

పడగొట్టి పట్టణమంతయు నిర్మానుష్య ముగా యున్నట్లు చూచెను. ఆ పట్టణస్థు లు నెమ్మదిగా దాని నుండి జారుకొని, ఓడలెక్కి తీరముకు అరమైలు దూరములో యున్న కోటలోనికి ప్రవేశించిరి. క్రీ॥పూ॥ 578లో నెబుకద్నెజరు మెట్టప్రాంతములో యున్న పట్టణమును నాశనము గావించి, బబులోనుకు తిరిగి వెళ్లెను.

తదుపరి 240 సంవత్సరముల తరువాత యెహెజ్కేలు ప్రవచనము లోని రెండవ భాగము నెరవేరెను.

అలెగ్జాండర్ దిగ్రేట్ అను చక్రవర్తి పర్షియా దేశమును ఇస్సాసు యుద్ధములో క్రీ॥పూ333లో ఓడించిన తరువాత అతడు మధ్యధరా సముద్ర ప్రాంతముకు తన సైన్యములను తరలించెను. అతడు తూరు పట్టణమునకు వచ్చినప్పుడు దాని ద్వార ములు తెరువవలెనని ఆ పట్టణస్థుల నడుగుగా వారు అందుకు నిరాకరించిరి. అతడా పట్టణముపై దండెత్తెను. అతని యొద్ద నావికా దళములు లేనందున మెట్ట ప్రాంతములో యున్న పట్టణమును నాశనము చేసి, దాని అవశేషములను దిబ్బలుగా కట్టి ద్వీపకల్పముగా యున్న తూరు పట్టణము చేరుకొనెను. ఏడు నెలల మట్టుకు అతడు గొప్ప ప్రతి ఘటన నెదుర్కొని నను అతడు గట్టు నిర్మించిన తరువాత తూరు పట్టణపు గోడలు పడగొట్టి దానిలో 8000 మంది నివాసులను హతము చేసి, 30 వేల మందిని బానిసలుగా అమ్మి వేసెను.

తూరు చరిత్ర అలెగ్జాండరుతో అంతమ వలేదు. 16 వందల సంవత్సరముల మట్టుకు ఆ పట్టణమును తిరిగి నిర్మించ ప్రయత్నించిరి. అది ఎప్పుడు తిరిగి నిర్మించబడినా, నాశనము గావించబడేది, చివరిగా క్రీ॥శ 1321లో ముస్లిముల దండయాత్రలలో ఆ పట్టణము సమూలనాశనము గావించబడెను.

నేడు ఆ స్థలములో జాలరుల చిన్న పల్లెటూరు వున్నది. గాని పురాతన తూరు పట్టణ స్థలమును ఇప్పుడు జాలరులు తమ నావలను కట్టుటకును, వలలు బాగు చేసుకొనుటకును వినియోగించుకొను చున్నారు. యెహెజ్కేలు ప్రవచనము ఖచ్చితముగా ఈ రీతిగా నెరవేరెను(యెహెజ్కేలు 26:7-14).

**బబులోను :**

యెషయా కాలములో (క్రీ॥పూ 740-690) అష్షూరు దేశము అరేబియా ప్రాంతము లో శక్తివంతమైనదై యుండెను. అయినను యెషయా భవిష్యత్తును ఎరిగి బబులోను పతనమును గూర్చి తెలియజేసెను.

యెషయా తన స్వజ్ఞానమును బట్టి చెబితే, బబులోను అష్షూరు చేత ఓడింపబ డునని చెప్పును. యెషయా చనిపోవు సరికి బబులోను అష్షూరుపై తిరుగుబాటు చేసెను. దాని జవాబుగా సెన్హెరీబు బబులోనును క్రీ॥పూ॥ 689లో కూలగొట్టెను. అతడు దాని

గోడలు పడగొట్టెను. దానిలోని గోడలను, భవనములను నాశనము చేసెను. దాని చెత్తనంతటిని అరక్తుకాలవలలో పడవేసెను. అయితే ఈ నాశనమును గూర్చి యెషయా తలంచ లేదు.

సెన్హెరీబు పరిపాలించిన కాలమంతటిలోను బబులోను దిబ్బగానే యుండిపోయెను. అయితే అతని కుమారుడగు ఏసర్హద్దోను సింహాసనము నెక్కినప్పుడు బబులోను పట్టణమును అతడు తిరిగి నిర్మించెను.

క్రీ॥పూ॥ 620లో నబోప్లాసరు అష్షూరు పాలనను అంతమొందించి బబులోనును నవబబులోనీయుల సామ్రాజ్యపు ముఖ్యపట్టణముగా చేసెను. తదుపరి బబులోను శిల్పశాస్త్రపు పనులలో నిమగ్నమాయెను. నబోప్లాసరు కుమారుడైన నెబుకద్నెజరు-2 సింహాస నమునెక్కినప్పుడు (క్రీ॥పూ॥ 605-562) బబులోను పట్టణమును నాటి ప్రపంచములో గొప్ప అద్భుత పట్టణముగా తీర్చిదిద్దెను.

క్రీ॥పూ॥ 700 సంవత్సరమునకు దరిదాపులో, నవబబులోను పతనమునకు 150 సంవత్సరముల ముందు యెషయా దానిని గూర్చి ప్రవచించాడు : "వారి మీద పడుటకు నేను మాదీయులను రేపెదను. వీరు వెండిని లక్ష్యము చేయరు, సువ ర్ణము కూడ వారికి రమ్యమైనది కాదు". "అప్పుడు రాజ్యములకు భూషణమును కల్దీయులకు అతిశయాస్పదమును మహాత్మ్యమునగు బబులోను దేవుడు పాడుచేసిన సొదొమ గొమొర్రాలవలెను నుండును. అది మరెన్నడును నివాస స్థలముగా నుండదు. తర తరములకు దానిలో ఎవడు కాపురముండడు. అరబీయులలో ఒకడైనను ఎవడు అక్కడ తన గుడారమును వేయడు. గొర్రెలు కాపరులు తమ మందలను అక్కడ పరుండనీయరు. నక్కలు అక్కడ పండుకొనును. గురు పోతులు వారి యిండ్లలో ఉండును నిప్పుకోళ్లు అక్కడ నివసించును. కొండమేకలు అక్కడ గంతులు వేయును. వారి నగరులలో నక్కలును, వారి సుఖ విలాస మందిరములలో అడవి కుక్కలును మొరలిడును. ఆ దేశమునకు కాలము సమీపించియున్నది. వారి దినములు సంకుచితములు" (యెషయా 13:17-22). "నేను దానిని తంబోడికి స్వాధీనము గాను, నీటి మడుగులుగాను చేయుదును. నాశనమను చీపురు కట్టతో దాని తుడిచి వేయుదును అని సైన్యముల కధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు" (యెషయా 14:23).

బబులోను మీదికి దేవుడు మాదీయులను పంపునని యెషయా ప్రవచించాడు. మరియు బబులోను సొదమ గొమొర్రాల వలె బొత్తిగా

నాశనము చేయబడును. దానిలో ఎవడు మరల కాపురముండడు, అరబీయులలో ఎవడు అక్కడ తన గుడారము వేసికొనడు, అక్కడ మందలు మేత మేయవు, ఎడారి జంతువులు అక్కడ నివసించును, మరియు అది నీటి మడుగులుగా చేయబడునని అతడు ప్రవచించాడు.

క్రీ॥పూ॥ 539లో ఈ నవబబులోను సామ్రాజ్యము పతనమాయెను. మాదీయ పారశీక సైన్యములు దానిపై దండెత్తి యూఫ్రటీసు నది ప్రవాహ మార్గమును మళ్లించగా ఆ ప్రాంత మంతయు నీటి మడుగులుగా మారెను. దండెత్తుచున్న సైన్యములు ఆరిన నది మీదుగా వెళ్లి ఎవ్విధమైన ప్రతిఘటన లేకుండా ఆ పట్టణమును పట్టుకొనిరి. రాజైన బెల్షస్సరు అతని అధిపతులు తమ పట్టణములోనికి ఎవడు ప్రవేశింపలేడనే ధైర్యముతో విందు జరుపుకొనుచుండిరి. కోరేషు రాజు కొన్ని దినముల తరువాత ఆ పట్టణములో ప్రవేశించి దానిని పర్షియా సామ్రాజ్య ముఖ్య పట్టణము చేసెను. తదుపరి యూదులు తమ స్వదేశమునకు తిరిగి వెళ్లవచ్చుననే శాసనమును జారీ చేసెను.

కాలము గడుచుకొలదీ బబులోను లోని గుడులు, గోపురములు క్షీణించు చుండెను. క్రీ॥పూ॥ 331లో అలెగ్జాండరు చక్రవర్తి బబులోనుపై దండెత్తి దానిని వశము చేసికొనెను. గాని అలెగ్జాండరు చక్రవర్తి క్రీ॥పూ॥ 323లో చనిపోయెను. అతని సామ్రాజ్యమును నలుగురు సైన్యాధిపతులు పంచుకొనిరి. తత్ఫలితముగా దశాబ్దముల తరబడి పోరాటము సంభవించగా దాని నడుమ బబులోను పట్టణము పూర్తిగా ఖాళీ చేయబడెను. దాని నివాసులు సెలూసియాకు తరలించబడిరి. క్రీ॥పూ 141లో పార్థియునులు ఆ ప్రాంతమును స్వాధీనము చేసికొను సరికి బబులోను పూర్తిగా నిర్మానుష్యమాయెను.

తదుపరి 800 సంవత్సరముల మట్టుకు బబులోను క్రమేపి ఇసుకతో కప్పబడెను, అది మరువబడెను. బైబిలు సమాప్తి చేయబడిన చాల కాలమునకు యెషయా ప్రవచనము ఈ రీతిగా నెరవేరెను. క్రీ॥శ 1899వ సంవత్సరములో పురావస్తు శాస్త్రజ్ఞులు ఆ పట్టణ ప్రదేశమును కనుగొని ఆ పురాతన పట్టణమును తమ త్రవ్వకాలలో వెలికి తీసిరి. 1985లో సద్దాం హుస్సేన్ పురాతన బబులోను శిథిలములపై దానిని మరల నిర్మించ పూనుకొనెను. గాని అప్పుడు అమెరికాతో సంభవించిన మొదటి గల్ఫ్ యుద్ధము వలన అది ఆపు చేయబడెను. 2003లో సద్దాం కొండపై అతడొక భవనమును, గోపురములను కట్టించి, బేబిలాన్ (బబులోను) పట్ట ణముపై కేబుల్ కార్లు (ఆకాశమా ర్గము) నిర్మించుటకు

ప్రణాళికలను సిద్ధపరచు కొనెను. గాని అమెరికా ఇరాక్ పై దండెత్తుట వలన అతని ప్రణాళికలన్నీ బూడిదపాలాయెను, చివరకు అతడు కూడ ఉరి తీయబడి నశించెను. ఈ రీతిగ యెషయా ప్రవచనములు అక్షరాల నెరవేరి బైబిలు దేవుని వాక్యమని ఋజువులు నిచ్చుచున్నవి.

**పెట్రా మరియు ఏదోము:**

ఏదోము యొక్క ముఖ్యపట్టణము పెట్రా. అది ఎత్తైన ఎర్ర కొండలపై గులాబీ ఆకారములో నిర్మించబడెను. దమస్కు నుండి ఐగుప్తుకు పోవు రాజ మార్గములో అదివుండెను. దాని సైజుబట్టి చూస్తే అది ఆశ్చర్యకరముగా సంపదతో తులతూగుచుండెను. ఏదోము యొక్క ప్రకాశమాన కాలములో అయిదుగురు ప్రవక్తలు దాని నాశనమును గూర్చి ప్రవచించిరి.

**యెహెజ్కేలు ఇట్లు వ్రాసాడు :** "ఏదోము మీద నా చెయ్యిచాపి మనుష్య లేమి పశవులేమి దానిలో నుండకుండ నేను సమస్తమును నిర్మూలము చేయుదును. తేమాను పట్టణము మొదలుకొని నేను దాని పాడు చేయుదును. దదాను వరకు జనులందరు ఖడ్గము చేత కూలుదురు" (యెహెజ్కేలు 25:13). "నేను మీకు విరోధినై మిమ్మును జనములకు దోపుడు సొమ్ముగా అప్పగింతును, అన్యజనులలో ఉండకుండ మిమ్మును నిర్మూలముచేతును, జనము కాకుండ మిమ్మును నశింపజేతును, సమూల ధ్వంసము చేతును" (యెహె 25:7).

మొదటిగా ఏదోమును అష్షూరీయులు ఓడించిరి, తదుపరి బబులోనీయులు, పిమ్మట యూదా మక్కాబియ మరియు జాన్ హిర్కేనస్‌లు దానిని ఓడించిరి. ప్రతిసారి ఏదోము తిరిగి లేచెను. యేసుక్రీస్తు కాలమునాటికీ పెట్రా ఇంకను ప్రసిద్ధిగాంచిన పట్టణమే. గాని ఆరవ శతాబ్ధములో చివరిగా ఏదోమును ముస్లింములు ఓడించిరి; వ్యాపార మార్గములు మార్చబడెను. చివరకు పెట్రా సర్వనాశనమాయెను. అది ఇప్పుడు అడవి జంతువులకు నివాసమాయెను.

నేడు పెట్రాపట్టణమును టూరిస్టులు తిరిగి కనుగొన్నారు. గాని ఆ ఏరియాలో యెహెజ్కేలు చెప్పినట్లు తేమాను మాత్రమే ఇప్పుడు చెప్పుకోదగిన ఊరు. ఏదోముకు వ్యతిరేకముగా చెప్పబడిన ప్రవచనములు వెయ్యి సంవత్సరముల తరువాత అక్షరాల నెరవేరెను.

ఈ ప్రచనములన్నియు క్రీ॥పూ 250లో తర్జుమా చేయబడిన సెప్టూజింట్ బైబిలులో యున్నవి. అవి మృత సముద్రపు గ్రంధపు చుట్టలలో కూడ యున్నవి. అవి క్రీ॥పూ 150 సం॥ల క్రితము లిఖించబడెను. ఈ ప్రవచనములు క్రీ॥శ 600 వరకు పూర్తిగా నెరవేరలేనందున,

అవి నెరవేరిన చాలాకాలము తరువాత ఈ ప్రవచనములు వ్రాయబడె నని ఎవరు చెప్పలేరు.

అమ్మోను, అష్కెలాను, ఐగుప్తు, ఎక్రోను, మెంఫిస్, మోయాబు, నీనెవ సమరయ, సీదోను మొ॥గు వాటిని గూర్చి ఇట్టి ప్రవచనములే చెప్పబడెను. అవన్నీ అక్షరాల నెరవేరెను.

**కొరాజీనా, బేత్సయిదా, కపెర్నహూము :**

క్రొత్త నిబంధన కాలములో గలిలయ సముద్ర తీరమున అందమైన నాలుగు పట్టణములుండెను. అవి : కపెర్నహూము, కొరాజీనా, బేత్సయిదా మరియు తిబెరయ, ఈ రోజు తిబెరయ మాత్రమే యున్నది. ఎందువలన?

తన పరిచర్య కాలములో యేసు మిగతా మూడు పట్టణములు తమ పాపములను గూర్చి మారుమనస్సు పొందనందున, ఆయన వాటిని గద్దించెను. ఆయన వారిని ఇట్లు గద్దించెను: "అయ్యో కొరాజీనా, అయ్యో బేత్సయిదా మీ మధ్యను చేయబడిన అద్భుతములు తూరు, సీదోను పట్టణములలో చేయబడిన యెడల ఆ పట్టణముల వారు పూర్వమే గొనెపట్ట కట్టుకొని బూడిద వేసికొని మారుమనస్సు పొంది యుందురు.... కపెర్నహూమా, ఆకాశము మట్టుకు హెచ్చించబడెదవా? నీవు పాతాళము వరకు దిగిపోయెదవు. నీలో చేయబడిన అద్భుతములు సొదొమలో చేయబడిన యెడల అది నేటి వరకును నిలిచియుండును, విమర్శ దినమందు నీ గతికంటె సొదొమ దేశపు వారి గతి ఓర్వతగినదై యుండునని మీతో చెప్పుచున్నాను" (మత్తయి 11:21-24).

దేవుని ప్రవక్తలందరు దేవుని నుండి పొందిన అధికారము చొప్పున పలికిరి. వారి ప్రవచనముల నెరవేర్పును బట్టి వారి మాటలు దేవుని మాటలే యని తిరుగు లేని రుజువును మనకిచ్చుచున్నవి.

మీరు సత్యవాక్కు సాలు చందా చెల్లించారా? లేదా
ఇప్పుడే 50/- రూ॥లు పంపించి మీ పత్రిక
కొనసాగించుకోనండి. క్రొత్తవారిని చేర్పించండి.
- ఎడిటర్

# పెద్దలు -వారి విధులు, బాధ్యతలు
## (Elders, Their Duties and Obligations)

"తోటి పెద్దను క్రీస్తు శ్రమలను గూర్చిన సాక్షిని బయలు పరచబడబోవు మహిమలో పాలివాడనునైన నేను మీలోని పెద్దలను హెచ్చరించుచున్నాను. బలిమి చేతకాక దేవుని చిత్త ప్రకారము ఇష్టపూర్వ కముగాను, దుర్లాభాపేక్షతోకాక సిద్ధ మనస్సు తోను, మీ మధ్యనున్న దేవుని మందను పై విచారణ చేయుచు దానిని కాయుడి. మీకు అప్పగింపబడిన వారిపైన ప్రభువు లైనట్టుండక మందకు మాదిరి లుగా ఉండుడి" (1 పేతురు 5:1-3).

"దేవుడు తన స్వరక్తమిచ్చి సంపా దించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్ష లనుగా ఉంచెనో ఆయావత్తు మందను గూర్చియు మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి" (అపొ.కా. 20:28).

**నిషేధములు :**

పెద్దలకు నిషేధింపబడిన కొన్ని సంగతులను మొదట గమనింతుము.

**బలిమిచేత కాకూడదు :**

పెద్దగా పనిచేయుటకు ఒకడు ఎన్నడు బలవంతముగా ఒప్పుకొన కూడదు. అట్టిపనినిన అయిష్టముగా అంగీకరించిన వాడు ఘోరముగా విఫలమ గును. ఇంతగొప్ప పనికి మనసు లేనప్పుడు దానిని ఎవరు చేయలేడు. ఎంత త్యాగం చేయవలసి వచ్చినా, పని ఎంత కష్టమయి నా, దానిని సంతోషము తో, ఇష్టపూర్వకంగా సిద్ధ మనస్సుతో జరిగించాలి.

**దుర్లా భాపేక్ష కొరకు కాదు :**

ధనార్జన కొరకని ఎవడు ఎన్నడు సంఘ పెద్ద యొక్క పనిని కోరుకొన కూడదు. ధనార్జన కొరకని పెద్దగా పనిచేయుటకు ఒప్పుకొనిన వాడు విఫల మగును. తాను చేయబోవు మంచిని గూర్చి ఎంచుకొనినవాడై ఒకడు స్థానిక సంఘపెద్దగ్గాపనిచేయుటకు అంగీకరిం చవలెను. అతడు చేయునది ప్రేమతో కూడిన పరిచర్యయే.

**ప్రభువులుగా యుండకూడదు :**

సంఘపెద్దలు వాణిజ్యశాఖ యజమా నులుగా (Business Executives) గాని, కర్షక యజమానులుగా గాని కఠినముగా ప్రవర్తించక, తమ బిడ్డలను ప్రేమించి ఆదరించే తండ్రులుగా దేవుని కుటుంబమును పాలించాలి. యేసు తన శిష్యులకిట్లు చెప్పారు : "అన్యజనులలో అధికారులు వారిమీద ప్రభుత్వము చేయుదురనియు, వారిలో గొప్పవారు

వారి మీద అధికారము చేయుదురనియు మీకు తెలియును. మీలో అలాగుండ కూడదు; మీలో ఎవడు గొప్పవాడై యుండగోరునో వాడు మీపరిచారకుడై యుండవలెను, మీలో ఎవడు ముఖ్యుడై యుండగోరునో వాడు మీదాసుడై యుండవలెను" (మత్తయి 20:25 -26). విచారం యేమంటే అనేక క్రైస్తవ నాయకులు ఈ పాఠాన్ని నేర్చుకోలేదు.

తప్పుడు భావాన్ని సమర్ధించుట కొరకు కొన్ని సందర్భాల్లో లేఖనములు వ్యతిరేకించబడతాయి. కొన్ని సార్లు క్రమశిక్షణ లేని సభ్యులు వారిపై పెద్దలు ప్రభువులుగా పనిచేయుచున్నారని ఫిర్యాదు చేస్తారు. దుష్ట స్వభావముగల వారు పెద్దలకు లోబడకుండా గందర గోళము సృష్టిస్తారు. మరొక ప్రక్క పెద్దలుగా పనిచేయుటకు సామర్థ్యము లేనివారు. తాము 'పాలించాలని' చెబుతు నిరంకుశులుగా ప్రవర్తిస్తారు. తమ ప్రవర్తనను సమర్ధించుకొనడానకి ప్రజలు ఎన్నయినా సంగతులు చెబుతారు. అట్టి ప్రజలకు సహాయం యేమీ ఉండదు. అయితే దేవుని సంకల్పము చొప్పున నడుచుకొనుటకు యిష్టపడువారి మధ్య ఆయన సంకల్పము చక్కగా పనిచేయును, మంచినే చేయుటకు మనసున్న యెడల ప్రజలు కలిసి దానిని సాధించగలరు. మనకు సమాధనము కావాలని కోరుకొన్నయెడల దానిని పొందుదుము. దానికొరకు మనం కృషి చేయాలి.

**విధులు, బాధ్యతలు :**

సంఘపెద్దల విధులను గూర్చి ఇప్పుడు కొంత తెలిసికొందము: "మిమ్మును గూర్చి మీరు జాగ్రత్తగా యుండుడి". ఒకడు తన అడుగులను సరిగా కాపాడుకొనకపోతే ఎవడును పెద్దగా పనిచేయలేడు. మునిగి పోవుచున్న వానిని కాపాడువాడు మొదట తాను కొట్టుకొనిపోకుండ కాపాడుకోవాలి. పెద్దయైనవాడు నిందారహితుడై యుండాలి. ఎవడు అతని నిందింపని విధముగా అతడు జీవించాలి. అతడెన్నడు చీకటిలో సంచరిం చి తన వస్త్రములను పాపముతో మురికి చేసికోకూడదు. పాపము చేయు సంఘ సభ్యుడెవడైనా సంఘమునకు చెడ్డ పేరు తెచ్చును. అయితే పాపము చేయు వానికి సంఘ పెద్దగా యుండు బాధ్యతను అప్పగిస్తే అట్టివాడు సంఘమునకు మరింత చెడ్డ పేరు తెచ్చును.

"మీ మందను గూర్చి జాగ్రత్తగా యుండుడి" : స్థానిక సంఘ పెద్దలు సంఘ సభ్యులందరితో సన్నిహిత సంబంధము కలిగి యుండకపోతే వారు సభ్యుల యొక్క ఆత్మీయ అవసరములను గూర్చి ఎరుగ లేరు. తమకప్పగింప బడిన ఆత్మల కాపరిగా తమకు భాధ్యత ఇయ్యబడియున్నదని వారెరుగాలి. వారు నిత్యము మెళకువగా యుండి కాయాలి. దాని ప్రాముఖ్యతను

మనం వక్కాణించాలి. పెద్దలు తమ శాయశక్తులా పనిచేయుటకు సిద్ధపడి యుండాలి. తమ కప్పగింపబడిన బాధ్యతల నిర్వహణను గూర్చి వారు దేవునికి లెక్క యొప్పగించాలి. వారి నిర్లక్ష్యము వలన గాని, నిర్వహణలోపము వలన గాని సంఘ సభ్యులు చివరకు నాశనమైపోతే, వారి రక్తమునకు పెద్దలే బాధ్యులు. దీని యొక్క తీవ్రతను పెద్దలందరు ఎరిగిన వారైతే ప్రభువు సంఘములో గొప్ప శాంతి సమాధానము లుండును. యితరుల ఆత్మలను వారు కాయుచు న్నారని పెద్దలు నిజంగా ఎరిగి యుం టే, స్థానిక సంఘములో అశాంతి యేమీ నెలకొల్పబడకుండా వారు జాగ్రత్త పడుదురు. తమ కాపుదలకు అప్పగింప బడిన ఆత్మల విషయమై పెద్దలు జాగ్రత్త వహించిన యెడల సంఘమునకు ఎంత యో మేలు.

**ప్రభువు సంఘమును కాయుడి :**

ఒక కాపరి తన గొర్రెలను ఏలాగు కాయునో ఆరీతిగా పెద్దలు సంఘమును సంరక్షించాలి, సంఘమును కాయాలి. పాస్టర్ అను పదము కాపరిని సూచించు చున్నవి.

కాపరులు ఉదయాన్నే లేచి తమ మందను మేత మేయుటకు తీసికొని వెళ్లుదురు. వారు మందకు ముందు నడుచుచు మందనంతటిని జాగ్రత్తగా పచ్చిక బయలులకు నడిపిం తురు. ఒక్కోసారి ఏదో ఒక గొర్రె ప్రక్కదారికి తొలగును. అప్పుడు కాపరి ఆ గొర్రెను పిలుచును. వాని స్వరంవిని అది అరచుచు తిరిగిమందలో చేరు కొనును. ఆప్యాయ తతో ఆకాపరి మందను సంరక్షించును. అపాయము నుండి మందను అతడు కాపాడును. చిన్నగొర్రెలను, బలహీనమైన వాటిని అతడు జాగ్రత్తగా గమనించును వాటికి ఆహారము, వసతి, భద్రత అనుగ్రహించును.

గొర్రెల కాపరి తనమందను పెద్ద దుడ్డు కర్రతో బాదినట్టయిన యేమగును? ఒకటి రెండు సందర్భాల తరువాత బహుశ అది అతని యొద్దకు ఎన్నడు రాకపో వచ్చును. సరికదా అతని స్వరము వినగా నే అటు యిట్టు పారిపోవును. సంఘమును కాయు వారు ఈ సందర్భమును గుర్తుంచు కోవాలి. గొర్రెలు తమ స్వరము వినాలని వారుకోరుచున్నట్టయితే తాము కాపుకా యు మంద యెడల ప్రేమను కనుబర చాలి. వారు మందను కాచి సంరక్షించుట మాత్రేమే గాక వారు ఎల్లవేళల జాగ్రత్త కలిగియుం డాలి. ఎవడైనను దారితొల గిపోవుచున్న యెడల వానిని దండనతో కాదుగాని ప్రేమతో తిరిగి తీసికొని రావాలి.

**పర్యవేక్షించాలి :**

పేతురు ఉపయోగించిన పదము

యిది. అందుకే సంఘ పెద్దలను బిషప్పు లని, ఓవర్సీర్‌లని బైబిలు పిలుచు చున్నది. స్థానిక సంఘము యొక్క పనులను సంఘ పెద్దలు పర్యవేక్షించాలి. అది వారి బాధ్యత. ఉపదేశమంతా వారే చేయనక్కర్లేదు గాని, సంఘములో చేయబడు ఉపదేశము, బోధ అంతా వారి పర్యవేక్షణలో జరగాలి, స్థానిక బోధకుడు, ఉపదేశకులు మొదలగు వారంతా నేరుగా పెద్దల పర్యవేక్షణలో బోధించాలి. వారిపై యుంచబడిన బాధ్యతలు గొప్పవి. ఈ దొడ్డ పదవికి నియమింపబడిన వారి బాధ్యతలు గొప్పవి ఈ దొడ్డ పదవికి నియమింపబడిన వారందరు తమ తమ బాధ్యతల నెరిగి యుండాలి.

సంఘ పెద్దల పనియొక్క ప్రాముఖ్య తను మరొక కోణము నుండి గమనించె దము. అనేక సందర్భాలలో సువార్తికుడు భవిష్యత్ ప్రణాళికను సూచించును. గాని దానికి క్రియా రూపమును పెద్దలు కల్పించుదురు. సువార్తికుడు ఆసక్తిని రేకెత్తించును. పెద్దలు దానికి రూపు కల్పింతురు. కొన్ని సార్లు సువార్తికుడు రేకెత్తించిన ఆసక్తిని బట్టి సంఘ సభ్యులు పురికొల్పబడుదురు గాని పెద్దలు దానిపై నీళ్లుజల్లుదురు. సంఘము యొక్క శక్తిని పూర్తిగా వారు వినియోగించరు. సరి గదా దానిని అణచుటకు ప్రయత్నింతురు. అట్టి సందర్భాలలో సంఘములో విస్ఫోటము సంభవించి అది ఛిన్నాభిన్న ములగును. సంఘాభివృద్ధిలో ఆసక్తి లేని పెద్దలు వారివలెనే ఆసక్తిలేని సువార్తికుని ఎంచుకోవాలి.

**దేవుని సంఘమును పాలించుడి :**

సంఘ పర్యవేక్షణను అంగీకరి చినప్పుడు పెద్దలు దానిని పాలించాలి. అధికారము గలవాడెవడు లేకపోతే ఏ సంస్థయు కొనసాగదు. క్లాసురూమ్‌లో టీచరే అధికారి. గృహంలో తండ్రి యజమానుడు, అధికారి. సంఘములో పెద్దలు అధికారులు. సరిగా ఆర్గనైజ్ చేయబడని సంఘములో కొన్ని బీటలు అక్కడకూడ కనబడవచ్చును. అవి క్రీస్తు రాజ్యవ్యాప్తిని అడ్డుకోవచ్చును. అయితే సంఘము సరియైనరీతిగా ఆర్గనైజ్ చేయబడితే యిది జరుగదు.

అన్ని విషయములలోను స్థానిక సంఘ పెద్దలు ఏకాభిప్రాయము కలిగి, వాటినే సంఘమునకు తెలియజేయాలి. అట్లు జరుగకపోతే సంఘపెద్దలు చీలిపోవుదురు. తత్ఫలితముగా సంఘము కూడా చీలిపోవును. తప్పు ఒప్పుల సమస్యపై పెద్దలు స్థిరముగా నిలబడాలి. అయితే మిగతా సాధారణ విషయములను గూర్చి సంఘ అభిప్రా యమును కూడ వారు గైకొనుట మంచిది. కొన్ని సందర్భాల్లో ఏదో ఒక

పెద్ద వేరొక సభ్యుడు ఇచ్చు సలహాను యేమీ పట్టించుకోడు, మిగతా పెద్దల సలహాను కూడ పట్టించు కోడు, అన్ని విషయము లలోను అతని మాటే నెగ్గాలనుకొంటాడు. లేకపోతే సంఘమంతటిని అల్లకల్లోలము జేస్తాడు. అట్టివానిని సంఘ సభ్యులు గౌరవిం చుట అసాధ్యము.

ప్రధాన కాపరియైన క్రీస్తు క్రింద పెద్దలు సంఘమును పాలించాలి, నిజమే. అయితే ఒక గొర్రెల కాపరి మందను ఎట్లుపాలిస్తాడో వారును అట్లే పాలించాలి, వారు మందకు ముందు నడువాలి. ఒకతోలు కర్రను చేత బట్టుకొని మందకు వెనుక యుండి దానితో మందను నడుప ప్రయత్నించు పెద్దలు త్వరలో తమ మందను కోల్పోవుదురు. స్వల్పముగా పాలింపబడు వారు సరిగ్గా పాలింపబ డుదురు. దేవుని గృహమును పాలించు నప్పుడు దానిలో నున్నవారె వరికి తమ పై కొరడా యున్నదనే భావన కల్పించ కూడదు.

మేము పాలించువారము, మీరం దరు మాకు లోబడియుండాలని పెద్దలు తరుచ సంఘమును హెచ్చరిం చుచుండిన యెడల, వారు త్వరలో తిరుగుబాటును ఎదుర్కొందురు. నీవు దాసుడవు గనుక నాకు ఎల్లవేళలా లోబడి యుండాలని తరుచు చెప్పబడు వానికి అది మింగుడు పడదు. నేనే యజమానినని తన భార్యకు, పిల్లలకు పదే పదే జ్ఞాపకము చేయువాడు, వారు అన్ని వేళలా తనకులోబడే యుండా లని చెప్పేవాడు తాను నిజంగా యజమా నిని కానని త్వరలో తెలిసికొంటాడు.

**"మాదిరిలుగా యుండుడి"** : పెద్దలు మందకు మాదిరిగా యుండాలి. యిది శక్తివంతమైన బోధనా విధానము. స్థానిక సంఘమునకు పెద్దలు మంచి మాదిరిని కెలకొల్పిన యెడల, వారు తమ విధులను నిర్వర్తించుటలో సమస్యలేమీ ఎదుర్కొనరు. తాము పర్యవేక్షించు వారితో ఎక్కువ బ్రతిమలాడుట అనవసరము. పెద్దలు సరియైన రీతిగా, సరియైన మార్గములో నడిపించిన యెడల మిగతావారు తమ్మును సులువుగా వెంబడింతురు. మంచినాయ కులకొరకు ప్రజలు ఎదురు చూచుచు న్నారు. మన ముందుండి జాగ్రత్తగానడుపు మంచి నాయకులను వెంబడించుట తేలికయే.

నీవొక పెద్దవైన యెడల ఈ విధులను మనస్సునందుంచుకొని నీ కప్పగింపబడిన దానిని జాగ్రత్తగా జరిగించుము. నీ పనిని గూర్చి నీవు దేవునికి లెక్క అప్పగింపబాధ్యుడవని గుర్తుంచుకొనుము.

- ఎల్.ఆర్. విల్సన్

## క్రైస్తవుడు నశించగలడా?

## (Can a Christian be losts?)

ప్రభువుచే పాపక్షమాపణ నొందిన వాడు తదుపరి తానేమి చేసినను ఎల్లప్పుడు రక్షింపబడిన స్థితిలోనే యుండునను సిద్ధాంతము వినసొంపు గానే యున్నది గాని అదిదేవుని వాక్యమునకు విరుద్ధముగా యున్నది.

"నాసహోదరులారా, మీలో ఎవడైనను సత్యము నుండి తొలగిపోయినప్పుడు మరియొకడు అతనిని సత్యమునకు మళ్లించిన యెడల పాపిని వాని తప్పు మార్గము నుండి మళ్లించువాడు మరణము నుండి యొక ఆత్మను రక్షించి అనేక పాపములను కప్పివేయునని తాను తెలిసికొనవలెను" (యాకోబు 5:19-20). ఈ లేఖనము రక్షింపబడినవారికి చెప్పబడినదని గమనించుము. వారు క్రైస్తవులు, దేవుని కుటుంబసభ్యులు. యాకోబు వారిని సహోదరులని సంబోధించాడు. ఇంకా యేమంటే రక్షింపబడినవాడు సత్యము నుండి తొలగిపోయినప్పుడు లేక మార్పునొందనప్పుడు అతని ఆత్మ నశించును. యిది మొదటి మరణం కాదు. అది అందరికీ సంభవించును (హెబ్రీ 9:27). గనుక ఇక్కడ చెప్పబడినది రెండవ మరణము. రెండవ మరణమును గూర్చి బైబిలు ఇట్లు చెప్పుచున్నది. "మరణమును మృతుల లోకమును అగ్ని గుండములో పడవేయబడెను, ఈ అగ్నిగుండము రెండవ మరణము" (ప్రకటన 20:14).

సత్యమునుండి తొలగిపోయిన వారు మార్పు చేయబడవచ్చును. అపో. పౌలు ఇట్లు చెప్పుచున్నాడు. "సహోదరులారా, ఒకడు ఏతప్పిదములోనైనను చిక్కుకొనిన యెడల ఆత్మ సంబంధులైన మీలో ప్రతివాడు తానును శోధింపబడుదునేమో అని తన విషయమై చూచుకొనుచు సాత్వికమైన మనస్సుతో అట్టి వానిని మంచి దారికి తీసికొని రావలెను" (గలతీ 6:1). వారిని పునరుద్ధరించుటలో వారెందుకు పడి పోయారో కారణాలను గమనించుట మంచిది. వాటిలో కొన్ని. నిరుత్సాహము. ఆత్మీయ ఎదుగుదల లేకపోవుట, ఈలోకాశలు, ధనాశలు, కామాతురత , నిర్లక్ష్యము, గాయపరచబడిన హృదయము, దుష్టత్వము, అహంకారము మొదలగునవి.

అట్టివారు తిరిగి ఎట్లు రావాలి? మారుమనస్సు పొందాలి, తమ తప్పిదముల నొప్పుకోవాలి, ప్రార్థించాలి, "మనపాపములను మనము ఒప్పుకొనిన యెడల ఆయన నమ్మదగినవాడును

నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహా 1:9).

తప్పుచేయుచున్న తన బిడ్డలను గూర్చి దేవుడు చింతించుచున్నారు. మారుమనస్సు పొందు ఒక్కపాపి విషయమై పరలోకమందు ఎక్కువ సంతోషము కలుగును. తప్పిపోయిన కుమారుడు తిరిగి రాగా గొప్ప విందు చేయబడెను. పడి పోయిన తన బిడ్డలను గూర్చి దేవుని కున్న ఆసక్తిని యిది మనకు వర్ణించుచున్నది.

దేవునితో నీ సంబంధము ఎట్లున్నది? తీవ్రముగా ఆలోచించు. నీ జీవితంలో యున్న ఆత్మీయ క్షామమును గుర్తించు. దేవుని సంఘము నుండి దూరమై నశించిన స్థితిలో యున్న దానిని గమనించు. తప్పి పోయిన కుమారునివలె "నేను లేచి నా తండ్రి యొద్దకు వెళ్లుదునని" చెప్ప గలవా? నీవట్లు చేస్తే పరలోకంలో నిన్ను గూర్చిగొప్ప సంతోషము కలుగును. దావీదు ఇట్లన్నాడు: "నామార్గములు నేను పరిశీలన చేసి కొంటిని. నీ శాసనముల తట్టు మరలు కొంటి ని, నీ ఆజ్ఞలు అనుసరించుటకు నేను జాగు చేయక త్వరపడితిని" (కీర్తన 119:59-60).

- జెర్రీ జెంకిన్స్

## నేనాయనశ్రీముఖమును చూడగోరుచున్నాను
## (I want to look upon His Face)

నేనెన్నడు యేసు యొక్క ఫోటోను గాని, వీడియోనుగాని, పాలరాతిపై చెక్కబడిన చిత్రమునుగాని చూడలేదు. అయినను యేసు నిజంగా జీవించారని, ఆయన దేవుని కుమారుడని నేను నమ్ముదును (యోహాను 20:30-31). ఆయన ఇప్పుడు పరలోకంలో యున్నారని ఒక దినమందు ఆయన తిరిగి వస్తారని దృఢము గా నమ్ముదును (అపొ.కా. 1:9-11), యోహాను 14:1-2). ఆయనను గూర్చిన దర్శనములు ఇప్పుడేమీ అవసరం లేదు.

ఆయనయందు విశ్వాసముంచాలంటే మనం ఆయనను చూడన వసరం లేదు. మనం "వెలిచూపు వలనకాక విశ్వాసము వలననేనడుచు కొనుచున్నాము" (2 కొరింథీ 5:7). "విశ్వాస మనునది నిరీక్షింపబడు వాటి నిజస్వ రూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు రుజువు నైయున్నది"

(హెబ్రీ 11:1).

ఆయన వలన దీవించబడుటకు ఆయనను మనం చూడనవసరం లేదు. ఏలయనగా ఆయనను"చూడక నమ్మిన వారు ధన్యులు" (యోహాను 20: 29).

ఆయనను ప్రేమించాలంటే మనం ఆయనను చూడనవసరం లేదు, ఏల యనగా "మీరు ఆయనను చూడక పోయినను ఆయనను ప్రేమించుచున్నారు" (1పేతురు 1:8).

అయినను సరే, నేనాయనను చూడగోరుచున్నాను.

ఒకానొక దినమందు మనం ఆయనను చూతుమని బైబిలు వాగ్దానము చేయుచున్నది. యోహాను ఇట్లు వ్రాసాడు: "ఇదిగో ఆయన మేఘారూఢుడై వచ్చుచున్నాడు, ప్రతినేత్రము ఆయనను చూచును" (ప్రకట 1:7). క్రైస్తవులు ఆయనను చూచుట మాత్రమేగాక ఆయన సముఖమందు ఉందురు, కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ ఉందుము. కాబట్టి మీరీ మాటలచేత ఒకనినొకడు ఆదరించుకొనుడి" (1థెస్స 1:18).

రెండువేల సంవత్సరముల క్రితము జీవించి, ఆయనను మనం చూచి యుంటే ఎంట్లుండేది? ఆయనను చూచిన వృద్ధుడొకడున్నాడు. అతని పేరు సుమెయోను. సుమెయోను యెరూషలేములో జీవిస్తుయుండెను. "ప్రభువు యొక్క క్రీస్తును చూడక మునుపు మరణము పొందడని అతనికి పరిశుద్ధాత్మ చేత బయలుపరచబడి యుండెను" (లూకా 2:26).

యోసేపు మరియలు బాలుడైన యేసును దేవాలయమునకు కొనిపోయిన పుడు ఆత్మవశుడై అతడు దేవాలయమునకు వచ్చెను. "అతడు తన చేతులతో ఆయనను ఎత్తి కొని దేవునిస్తుతించుచు ఇట్లనెను – "నాథా ఇప్పుడు నీ మాట చొప్పున సమాధానముతో నీ దాసుని పోనిచ్చుచున్నావు. నీవు సకల ప్రజల యెదుట సిద్ధపరచిన నీరక్షణ నేను కన్నులార చూచితిని" (లూకా2:28-30). ఒకానొక దినమందు మనము కూడ ఆయనను కన్నులార చూతుము. సుమ్మెయోనువలె అది మనకు మహానందదినము.

ఒక విధంగా నేడు మనం దేవుని చూచుచున్నాము క్రీస్తును ఆయన వాక్యము ద్వారాను, ఆయన నిర్మించిన ప్రపంచముల ద్వారాను మనం చూచుచున్నాము. (క్రీర్తన 19). గొప్ప శాస్త్రవేత్తయగు సర్ ఐజక్ న్యూటన్ దూరదర్శిని సహాయము వలన కొటాను కోట్ల మైళ్ల వరకు ఆకాశాన్ని చూడగలుగుదునని చెప్పాడు. "గాని దానిని నేను ప్రక్కను బెట్టి, నా గదిలోనికి వెళ్లి తలుపువేసి

మోకాళ్లని ప్రార్థించినపుడు నేను పరలోకాన్ని చూస్తాను, దూరదర్శిని లనేకముల కన్నా ప్రభువు యొక్క సాన్నిధ్యాన్ని పొందుదునని" అతడు చెప్పాడు.

క్రొత్త నిబంధన అంతకంటే ఎక్కువ నిరీక్షణ మనకిచ్చుచున్నది. ఒకానొక దినమందు మనం ప్రభువును చూస్తాము (హెబ్రీ 12:14). దేవుని యొక్క గొప్పతనాన్ని, మహిమను, ఆయన వీపును చూడడానికి మోషేకు ఒకమారు అనుమతి ఇయ్యబడింది (నిర్గమ33:20). "ఎవడును ఎప్పుడైనను దేవుని చూడ లేదని" క్రొత్తని బంధన విపులముగా బోధించు చున్నది (1 యోహాను 1:18; కొలస్స 1:15; 1 తిమోతి 1:17, హెబ్రీ 11:27). తాను దేవుని చూస్తానని యోబునమ్మాడు. "నా విమోచకుడు సజీవుడనియు, తరువాత ఆయన భూమి మీద నిలుచుననియు నేనెరుగుదును. ఈలాగు నా చర్మము చీకిపోయిన తరువాత శరీరముతో నేను దేవుని చూచెదనని" అతడు చెప్పాడు (యోబు 19:25-26). పరలోకంలో మనం ఆయన ముఖదర్శనము చేయుదు మని యోహాను నిర్ధారించాడు (ప్రక 22:4).

మన ప్రియుని ముఖాన్ని మొదటి సారి వివాహములో చూచెదము. "గొర్రెపిల్ల వివాహోత్సవ సమయము వచ్చినది. ఆయన భార్య తన్నుతాను సిద్ధపరచుకొని యున్నది" (ప్రక 19:8). యేసు మొదట వచ్చినప్పుడు "ఆయనకు సురూపమైనను సొగసైనను లేదు; మనము ఆయనను చూచి ఆపేక్షించు నట్లుగా ఆయనయందు సురూపము లేదు" (యెషయా 53:2). పరలోకము నుండి భూలోకమును ఆయన దర్శింప వచ్చినప్పుడు ప్రజలాయనను గుర్తు పట్టలేదు (యోహాను 1:10-14). గాని ఆయన రెండవసారి వచ్చునప్పుడు యేసు ఎవరు ఎన్నడు ఊహించని సుందరుడుగా అగుపడును. ఆయన యున్నట్లుగానే ఆయనను చూతుము కనుక మన నిరీక్షణ సరియైనదే (1 యోహాను 3:1-2).

-ఎలెన్ వెబ్‌స్టర్

---

**సత్యవాణి T.V. కార్యక్రమములను**
**ప్రతి బుధవారము సాయంత్రం 6:30 గంటలకు**
**రక్షణ ఛానల్ లోను, శనివారం ఉదయం 8 గంటలకు**
**ఆరాధన ఛానల్ లోను, మరియు ఆదివారం సాయంత్రం 6:00**
**గంటలకు శుభవార్త ఛానల్‌లోను చూడండి.**

# యేసు నీ యింటికి వచ్చిన యెడల

ఒకటి రెండు దినాలు మట్టుకు యేసు నీయింటికి వస్తే అనుకొకుండా ఆయన వస్తే నీ వేమి చేస్తావు?
ఆయన రావడం చూచి, చేతులు చాచి ఆ పరలోక అతిధిని నీ గుమ్మము దగ్గరే ఎదుర్కొందువా ? లేదా ఆయనను లోనికి ఆహ్వానించకముందు కొన్ని మేగజైనులు కాల్చివేసి బైబిలును ముందుంచి, కొన్ని సంగతులను అటు యిటు మార్చి ఆయనను లోపలికి రమ్మంటావా ?

అంత ప్రఖ్యాత అతిధికి నీ యింటిలో మంచి గదినే యిస్తావనినాకుతెలుసు ఆయనకు ప్రతిపూట రుచిగల వంటకాలనే వడ్డిస్తావు; మరియు ఆయన నీ యింటికి వచ్చినందుకు చాల సంతోషం అని పదేపదే చెప్తావు ఆయనకు సేవ చేయడం మరింత గొప్ప భాగ్యంఅని చెప్తావు. కానినీ యింట్లో సంభాషణ ఎట్లుంటాది ? భోజనం దగ్గర ప్రతిసారికృతజ్ఞత చెల్లించడం కష్టమౌతాదా ?

ఆయన నిరంతరం నీ యింట్లో వుండడానికి సంతోషిస్తావా? లేదా ఆయన చివరకు వెళ్లిపోయినప్పుడు అమ్మయ్య ! అనివూపిరి పీల్చుకొంటావా? నిజానికి యేసు నీతో కాలంగడపడానికి వస్తే నీవేమి చేస్తావో తెలిసికొనడం మంచిదే.

గమనిక ::

సత్యవాణి కార్యక్రమములను
ప్రతి బుధవారము సాయంత్రం 6:30 గంటలకు
రక్షణ ఛానల్ లోను, శనివారం ఉదయం 8 గంటలకు
ఆరాధన ఛానల్ లోను, మరియు ఆదివారం సాయంత్రం 6:00
గంటలకు శుభవార్త ఛానల్‌లోను చూడండి.

సత్యవాక్కు మాస పత్రిక కావాలంటే
సంవత్సరమునకు 50/- రూ॥లు చెల్లించవలెను.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/2009-11

To

From:

**SATYA VAKKU**

**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by [illegible] Gootam, Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004